రూ. 4,69,82,030 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.4,69,82,030 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్టోబర్ 9 నుంచి నవంబర్ రెండో తేదీ ఉదయం తొమ్మిది గంటల వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.1,56,27,23,165కు చేరుకుంది. ఇప్పటి వరకు రూ.49,40,26,323 విలువైన మద్యం, రూ.24,79,45,654 విలువైన మత్తు పదార్థాలను పట్టుకున్నారు.

బిఎస్‌పిలో చేరిన పెద్దపల్లి బిఆర్ఎస్ జడ్‌పిటిసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
బహుజన వాదం రాష్ట్రంలో చాప కింద నీరులా వ్యాపిస్తున్నదని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి బిఆర్ఎస్ జడ్‌పిటిసి, పార్టీ సీనియర్ నేత బండారు రామ్మూర్తి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో గురువారం హైదరాబాదులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బిఎస్‌పి కండువా కప్పుకున్నారని తెలిపారు. ఆయన వెంట పెద్దపల్లి మాజీ జడ్‌పిటిసి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్ల కొమురయ్య ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అగ్రవర్ణ పాలకులు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలను ఓటర్లుగానే మార్చి వాళ్ల కబంధహస్తాల్లో అధికారం పెట్టుకున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రకారం బిసిలకు 60 అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఆరేపల్లి మధు, పెద్దపల్లి కౌన్సిలర్ పోతాను పురుషోత్తం తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ ఇంచార్జ్ దాసరి ఉష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి హనుమయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

కెసిఆర్ దోపిడీ సొమ్మునంతా కక్కిస్తాం

- ప్రజల ఖాతాల్లో జమ చేస్తాం
- కాంగ్రెస్ ద్వారానే ప్రజా తెలంగాణ
- రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కాంగ్రెస్ పార్టీ ద్వారానే ప్రజా తెలంగాణ సాధ్యమని, ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రాజెక్టుల పేరిట సిఎం కెసిఆర్‌తో పాటు బిఆర్ఎస్ నేతలు దోచుకున్న సొమ్మును కక్కించి ప్రజల ఖాతాల్లో జమ చేస్తామని ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సదస్సులో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని స్పష్టంచేశారు. మోడీ, కెసిఆర్ పాలనలో సిలిండర్ ధర రూ.1200కు చేరిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి ప్రజల తెలంగాణగా మారుస్తామని తెలిపారు. కెసిఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎటిఎంలా మారిందని, తెలంగాణ ప్రజల సొమ్మును దోపిడీ చేశారని విమర్శించారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2,500 ఇవ్వనున్నట్టు వెల్లడించారు. బిఆర్ఎస్, ఎంఐఎం, బిజెపి మూడు ఒక్కటేనని ఆక్షేపించారు. అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. సభలో పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, మంథని కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావుతో పాటు రాష్ట్ర జిల్లా నాయకులు, మండల నాయకులు కోట రాజబాబు, అక్బర్ ఖాన్, ఎంపిపి రాణి బాయ్, జడ్‌పిటిసి గూడాల అరుణ, జిల్లా అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి, అంబటిపల్లి సర్పంచ్ విలాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనను అడ్డుకున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న రాహుల్ గాంధీ.. సభ అనంతరం మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. ఆయనతోపాటు పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, మంథని కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు ఉన్నారు. ముందుగా హెలికాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా రాహుల్ మేడిగడ్డను పరిశీలించారు. అనంతరం కుంగిన మేడిగడ్డ బ్యారేజీ 15 బ్లాక్ నుంచి 25 బ్లాక్ వరకు కాంగ్రెస్ నేతలతో కలిసి నేరుగా సందర్శించారు. ప్రాజెక్టు పరిస్థితిని ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. కాగా, అంబట్‌పెల్లి గేట్ నుంచి ప్రాజెక్టు గేటు వద్దకు వారు వెళ్లగా సిఆర్‌పిఎఫ్ ప్రత్యేక పోలీస్ బలగాలు వారిని నిలువరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిని కళ్లారా చూడ్డానికే ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు సిఎం కుటుంబానికి ఎటిఎంలా ఉపయోగపడిందే కాని ఏ ఒక్క రైతుకూ దీనివల్ల ఉపయోగం లేదని విమర్శించారు. ప్రాజెక్టు ద్వారా నష్టపోయిన రైతులు, ప్రజలకు న్యాయం చేస్తామని వెల్లడించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగిందని, దీనిపై న్యాయ విచారణ జరిపించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలన్నాయని, ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ఈ ప్రాంతంలో వందల ఎకరాల పంటలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మేడిగడ్డ ఘటన మరువకముందే అన్నారం ప్రాజెక్టులో నీటి బుంగలు ఏర్పడి నీరు పైకి ఉబికి వస్తూ ఉండటం వెనుక ఎలాంటి నిర్లక్ష్యం ఉందో తెలుస్తోందని అన్నారు. అంతకుముందు మేడిగడ్డ వద్ద హై టెన్షన్ వాతావరణం నెలకొంది. మేడిగడ్డకు వెళ్లే దారులన్నీ పోలీసులు మూసేశారు. అప్పటికే పెద్ద ఎత్తున చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు.. బారికేడ్లను తోసుకుంటూ దూసుకెళ్లారు. కాగా 144 సెక్షన్ అమలులో ఉందని.. అనుమతి లేదని పోలీసులు కార్యకర్తలను అడ్డుకున్నారు. దాంతో పోలీసు లకు, కార్యకర్తలకు వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. దీంతో వారంతా అంబటిపెల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు.

ఉద్యోగస్తులు రాజకీయాలు చేయొచ్చా?

- గులాబీ కండువా వేసుకున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి

ప్రజాశక్తి - హైదరాబాద్
ఒకవైపు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ మరోవైపు రాజకీయాలు చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది ఎక్కడో కాదు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన ఎంపిటిసి భర్త కొన్ని నెలలుగా అధికార పార్టీ తరపున వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా ఏకంగా మెడలో గులాబీ కండువా వేసుకొని ప్రచారం చేస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేసి చేయాలని, ఉద్యోగం చేస్తూ ఇటు రాజకీయం చేయటం సిగ్గుచేటని ప్రజలు అంటున్నారు. అతన్ని వెంటనే విధుల నుంచి తొలగించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని ఎన్నికల అధికారి దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అప్పటికీ ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

బైండోవర్ పేరుతో పోలీసుల వేధింపులు ఆపివేయాలి : టిజెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు టిజెఎస్ కార్యకర్తలను, నాయకులను బైండోవర్ పేరుతో వేధించడాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ కారులుగా నాటి జెఎసి నాయకులుగా మాపై ఆనాడు సీమాంధ్ర పాలకులు మోపిన కేసుల ఆధారంగా పాత నేరాలు అనే పేరుతో పోలీసులు బైండోవర్ చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. స్థానిక పోలీసులు అధికార పార్టీ నాయకుల సూచనతో ప్రశ్నించే నాయకులను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ జోక్యం చేసుకుని ఈ తరహా అప్రజాస్వామిక పరిస్థితులను చక్కదిద్దాలని కోరారు.

మోడీకి ప్రయివేటీకరణ పిచ్చి

- సంస్కరణలు పేరుతో అన్నింటిని అమ్మేస్తుండు
- కాంగ్రెస్ వస్తే పథకాలు దరిచేరవు
- ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏళ్ల పాటు ఏకదాటిగా పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు మళ్లీ ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నదని, ఒక్క చాన్స్ ఇస్తే పంటికి అంటకుండా మింగుతరా అని కాంగ్రెస్ నాయకులను సిఎం కెసిఆర్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల కన్నా ముందు చాలా మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఉండేవారని, అప్పుడు ఏం జరిగిందో.. బిఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో చర్చించి ఓట్లేయాలని ప్రజలను కోరారు. మూడు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ రాజ్యం రావాలా.. 24 గంటలు కరెంటు ఇచ్చే బిఆర్ఎస్ కావాలా అని ప్రజలను ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, కరీంనగర్ జిల్లా ధర్మపురి నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ పాల్గొని మాట్లాడారు.

నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గెలువడమే కాదు, వీళ్ల గెలుపుతోనే రాష్ట్రంలో పార్టీ గెలుస్తుందని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి వంటి పార్టీలు ఎన్నికల్లో నిలబడ్డా, ఏ పార్టీ చరిత్ర ఏంటో, ఏ పార్టీ ప్రజలకు ప్రయోజనం కలిగించిందో ఆలోచన చేయాలన్నారు. ఓటు అనేది మన కిస్మత్‌ను నిర్ణయించేదని, వజ్రాయుధమే ఓటు అన్నారు. దాన్ని దుర్వినియోగం చేసుకుంటే తలరాతనే మారుస్తుందని, అందుకే ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి ఓటెయ్యాలని సూచించారు.

మోడీకి ప్రయివేటీకరణ పిచ్చి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రయివేటీకరణ పిచ్చి పట్టిందని, సంస్కరణల పేరుతో కేంద్రం అన్నింటినీ ప్రయివేటుపరం చేస్తూ, తన ఆప్తులకు అందిస్తున్నారని విమర్శించారు. బాయికాడ మీటర్లు పెట్టాలని.. తనపై ఒత్తిడి తెచ్చి బెదిరించినా తలొగ్గలేదని తెలిపారు. దాంతో తెలంగాణపై కక్షగట్టి రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధుల్లో కోతపెట్టారని, సంవత్సరానికి రూ. ఐదు వేల కోట్ల చొప్పున గడిచిన ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల నష్టం రాష్ట్రానికి వాటిల్లిందని తెలిపారు. అయినప్పటికీ రైతుల శ్రేయస్సు కోసం మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశానని తెలిపారు.

తెలంగాణ సెక్యూలర్ రాష్ట్రంగానే ఉంటుంది

తాను బతికున్నంత కాలం తెలంగాణ సెక్యూలర్ రాష్ట్రంగానే ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు లక్షల పోడు పట్టాలు జారీ చేశామని, పాత కేసులను రద్దు చేశామని, నాలుగు వేల గూడేలు, తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దామని.. ఇక్కడ వారే పాలకులుగా మారారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎలాంటి కరువు, కర్ఫ్యూ, మతకల్లోలాలు వంటివి లేవని తెలిపారు. ఎంపి ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సభల్లో.. మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్న గారి జీవన్‌రెడ్డి, బీగాల గణేష్ గుప్తా, బీఆర్ఎస్ ఖానాపూర్, బోథ్ అభ్యర్థులు జాన్సన్‌నాయక్, అనిల్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై ఈటల వ్యాఖ్యలు దారుణం

- టిడిపి నేత అర్వింద్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ రాజకీయాల్లో టిడిపి అధినేత చంద్రబాబు వేలు పెడుతున్నారంటూ బిజెపి నేత ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అర్వింద్‌కుమార్ గౌడ్ ఖండించారు. గురువారం ఆయన ఇతర టిడిపి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ బిజెపి ఎన్‌టిఆర్ జపం చేయటం లేదా? అని ప్రశ్నించారు. బిసి వర్గాలను ప్రోత్సహించిన టిడిపి, చంద్రబాబుపై ఈటల కామెంట్లు చేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం బిఆర్ఎస్ సహా కాంగ్రెస్ నేతలు చంద్రబాబు జపం చేస్తున్నారని గుర్తు చేశారు. ఓట్ల కోసం చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. బిసి ముఖ్యమంత్రిని చేస్తామని మొదట ప్రకటించింది టిడిపినేనని గుర్తుచేశారు. కొన్ని ప్రత్యేక కారణాల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నామని ప్రకటించారు. చంద్రబాబు సమయం ఇవ్వలేరన్న కారణంగానే పోటీచేయడం లేదన్నారు. బడుగు బలహీన వర్గాలకు కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం అని అన్నారు. సేవాభావంతో పుట్టిన పార్టీగా పేర్కొన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో టిడిపి పనిచేస్తున్నదని చెప్పారు. సైబరాబాద్ ఎవరు నిర్మించారో ఈటలకు తెలియదా ? అని ప్రశ్నించారు. ప్రపంచపటంలో హదరాబాద్ పేరు ఎలా వచ్చిందో అందరికి తెలిసిందేనని చెప్పారు. చంద్రబాబు హైదరాబాద్ వచ్చినప్పుడు ప్రజలు, మహిళలు, యువత ఎంత స్పందన వచ్చిందో గమనించారా ? అంటూ నిలదీశారు. విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్, అధికార ప్రతినిధి అనూప్‌కుమార్ బుడిగి, నాయకులు టి హరికృష్ణ, డాక్టర్ ఎఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: NANDYAL
O.S.1/2022
Dereddy Balanagi Reddy. ...Plaintiff
Vs
Mallu Ramalingeswara Reddy. ...Defendant
SUIT SUMMONS TO DEFENDANT
Mallu Ramalingeswara Reddy
S/o. Parameswara Reddy,
Doctor by Profession, Yarraguntla village
Bandi Atmakur mandal, Kurnool District,
Now residing at Flat No.102, Adithya Apartment, Behind Hyderabad Cutial,
Durga Nagar Colony, Punjagutta, Hyderabad,
Telangana State
Take notice that the plaintiff has filed the above suit you for recovery of amount of Rs. 1,76,845/- due under promissory note, and the said case posted on 22-11-2023 for making your appearance. In case of default in appearing on 22-11-2023 at 10-30 A.M. before the above court, the suit will be deciding experty.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వేలం తేది : 22-11-2023
M. Siva Sankara Reddy
K. Gouri Shankar
Advocates, Nandyal

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL DISTRICT JUDGE AT THIRUVALLUR
O.S.No. 242 of 2023
R.S. Sivaprakash ......Plaintiff
Vs.
Anuradha Raju Mudhuluru & 2 others .....Defendants
To
1. Anuradha Raju Mudhuluru (D1)
2. Sreevarshini Mudhuluru (D2)
3. Srinivasa Raju Mudhuluru (D3)
All are residing at Plot No.113, Door No.B4, Sree Nagar Colony, Ameerpet Colony, Hyderabad - 500 073.
The above suit O.S.No. 242 of 2023 was filed for Recovery of Money by the Plaintiff against you and the matter came up for hearing on 11-10-2023 and further adjourned the matter on 29-11-2023 for your appearance. Please take notice and appear in person or through counsel before the above said Hon'ble court on 29-11-2023 at 10.30 a.m., failing which matter will be decided in your absence.
K. SIVA KUMAR, M.A., B.L.,
ADVOCATE,
COUNSEL FOR PLAINTIFF.
Plot No.11. Ganapathy Nagar Extn.,
Rajajipuram Part-3,
Tiruvallore - 602 001.

ప్రచార సభలో వంటేరుకు మంట

- మహిళలపై దురుసుగా ప్రవర్తించిన ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామంలో బిఆర్ఎస్ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని మహిళలు అడ్డుకున్నారు. పదేళ్ల పాలనలో మాకేం చేశారంటూ నాయకులను నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బందారం గ్రామంలో ప్రచారం కోసం ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డితో పాటు పలువురు నాయకులు గ్రామానికి చేరుకున్నారు. ఊరేగింపు అనంతరం ప్రచార రథం పైనుంచి రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్ దుర్గయ్య మాట్లాడారు. అనంతరం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తుండగా గ్రామానికి చెందిన మహిళలు అడ్డు తగిలారు. మీరు మాకు ఏం చేశారంటూ నిలదీశారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువ నిర్మాణం చేయాలని పలుసార్లు నాయకులను కోరినా పట్టించుకోవడంలేదని, కాలువ నిర్మాణం జరగక పంటలకు సాగునీరు అందడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇళ్లులేని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందడం లేదని, గ్రామంలో రోడ్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని నిలదీశారు. రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా అమలు కాలేదని తెలిపారు. ఈ పదేండ్లలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేదని నిలదీశారు. మహిళల నిలదీతతో ప్రతాపరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగం ఆపేసి.. మహిళ వద్దకు వెళ్లి... నువ్వు అసలు మనిషివేనా... ఉంటూ దూషించారు. దాంతో కొద్దిసేపు వారి మధ్య వాగ్వాదం జరిగింది. నిలదీసిన మహిళతో ప్రతాపరెడ్డి దురుసుగా ప్రవర్తిస్తూ పక్కకు వెళ్లిపోయారు. అభివృద్ధి చేయలేదని నిలదీస్తే తమను దూషిస్తూ వెళ్లిపోయారని మహిళలు వాపోయారు.

మణిపూర్ పరిస్థితులు ఇప్పటికీ అధ్వానంగా ఉన్నాయి

- మణిపూర్ రచయిత్రి కుర్ ఫినా కిమ్ కోవా ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మణిపూర్ పరిస్థితులు ఇప్పటికీ అధ్వాన్నంగా ఉన్నాయని, కనీసం మతదేహాలకు కూడా దహన సంస్కారాలు చేసే పరిస్థితి లేదని మణిపూర్ రచయిత్రి కుర్ ఫినా కిమ్ కోవా ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారు నెలలుగా 107 మృతదేహాలు మార్చురీలోనే ఉన్నాయని, వాటిని తీసుకెళ్లే పరిస్థితులు కూడా లేవని తెలిపారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 'రాజకీయ, విద్యా, శాస్త్రీయ' అంశాలపై మూడు రోజుల 'శిక్షణ తరగతులు' హైదరాబాద్ మగ్దూం భవన్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం సదాలక్ష్మి అధ్యక్షత వహించగా, ప్రారంభ సూచికగా ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజా ఎన్ఎఫ్ఐడబ్ల్యు పతాకాన్ని

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుర్ ఫినా కిమ్ కోవా మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం ప్రయత్నించలేదని విమర్శించారు. మహిళలంతా ఐక్యంగా నిలబడితే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందంటూ, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మణిపూర్ ఘటనలో తమకు సంపూర్ణ మద్దతుగా నిలిచిన భారత మహిళా సమాఖ్యకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

అదానీకి ఖనిజ సంపద దోచిపెడుతున్న మోడీ సర్కార్: అనీరాజా

మణిపూర్ ఖనిజ సంపదను అదానీకి దోచిపెట్టేందుకే కేంద్రం, మణిపూర్ బిజెపి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అనీ రాజా విమర్శించారు. మణిపూర్ అల్లర్లు పూర్తిగా సద్దుమణిగి, వారికి న్యాయం జరిగే వరకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తుల సవాలును తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసి, వారికి మద్దతుగా నిలువడమే మోడీ ప్రభుత్వ లక్ష్యమని దుయ్యబట్టారు. అనేక పోరాటల ద్వారా సాధించుకున్న చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని, ఆ చట్టాలకు కనీసం విలువ కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. మహిళా సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ఉద్యమించాలని అనీరాజా సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి. జ్యోతి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ ఛాయాదేవి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

In the court of the III rd Addl. Junior Civil Judge, (Excise Court) Ananthapuramu
I.A.No:764/2018 in O.S.No:414/2018
Between:
1.Valmiki Nrithik Taman
2.Valmiki Yashas Taman (Minor) Rep by his Mother And Guardian ...Petitioners/Plaintiffs
And
Valmiki Venkata Ramanappa and others ...Respondants/ Defendants
Notice Respondant No:2 & 5
R2: Valmiki Chandra Shekar S/o V.Venkata Ramanappa,
R5: Valmiki Raja Kumar S/o V.Venkata Ramanappa, Both are R/at Flat No:207, Jadaarcade Paradise, Circle, MG Road, Beside Dadus Sweet Shop, Hydarabad Telangana State.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 07/11/2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(By order of the court)
N.P.SREENIVASULU
Advocate , Anantapuramu,
Cell:9440753607

రాష్ట్రంపై ఇసి నజర్

- గతం నుంచి గుణపాఠాలు
- ఖరీదైన ఎన్నికలుగా ముద్ర
- దేగకన్నుతో పర్యవేక్షణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై భారత ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టిందా? అడుగడుగూ డేగ కన్నుతో చూస్తోందా ? ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను అనుమానిస్తోందా? రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సైతం కెమెరా లెన్స్‌లో పరిశీలిస్తోందా? అంటే అవుననే సమాధానం ఆయా వర్గాల నుంచి వస్తోంది. ఇటు రాజకీయ విశ్లేషకులు, అటు ఎన్నికల కమిషన్ అధికారులు ఈ సంగతిని అంగీకరిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్నికలు జరుగుతున్న ఆరు రాష్ట్రాల కంటే తెలంగాణ ఎన్నికలే అత్యంత ఖరీదైనవిగా భావిస్తోంది. ఇందుకు 2018 చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, ఆతర్వాత వచ్చిన ఉప ఎన్నికలు రిపోర్టుల పరిశీలన తర్వాత సిఇసి ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. డబ్బు, మద్యం తెలంగాణలో ఏరులై పారినా పట్టించుకోలేదని, అయినా అప్పట్లో అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు అందరూ సర్కారుకు సహకరించారనే ఆరోపణలు, విమర్శలూ వచ్చిన విషయం విదితమే. ఇప్పుడా పరిస్థితి ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిసింది. అందుకే ప్రధానంగా చెక్‌పోస్టులను పెంచనున్నది. గతంలో వీటిని స్థానిక పోలీసులే పర్యవేక్షించేవారు. ఇప్పుడు స్థానిక పోలీసులకు అదనంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) బలగాలను సైతం వాడుతోంది. గత నెల 22 నుంచి అమల్లోకి తెచ్చింది. ఇప్పుడున్న 148 చెక్‌పోస్టుల సంఖ్యను మరింత పెంచాలని భావిస్తోంది. అవసరమైతే 300 నుంచి 350 వరకు ఏర్పాటు చేయాలనే యోచనలో ఉంది. తద్వారా రెండంచల విధానానికి శ్రీకారం చుట్టనుంది. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావం లేకుండా నిర్వహించాల ని భావిస్తోంది. అంతేగాక గతంలో కోడ్ ఉల్లంఘనలు చాలా జరిగినా చర్యలు తీసుకోలేదనే ఫిర్యాదులు సీఈసీకి వెళ్లాయి. ఈసారీ వాటిపైనా నిఘా పెట్టింది. అందుకే ప్రతినియోజకవర్గానికి ఒక ప్రత్యేక పరిశీలకుడిని నియమిస్తోంది. ఇప్పటికే నియామకాలు చేపట్టింది. వీరితోపాటు ఆర్థిక పరిశీలకులూ ఉంటారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో ఉన్న కలెక్టర్లు, ఎస్‌పిలు ప్రత్యేక పరిశీలకుల ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుంది. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పోలీస్‌వ్యవస్థ కఠినంగా వ్యవహరించేలా ఇప్పటికే ఆదేశాలిచ్చింది. వాహనాలు తనిఖీలు చేయడం, ఎప్పటికప్పుడు డబ్బు, మద్యం రవాణాను నిరోధించడం, కేసులు పెట్టడం తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే ఈ మారు కొత్తగా ప్రభుత్వ వాహనాలను సైతం తనిఖీ చేయాలనే ఆదేశాలు కేంద్ర బృందం హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఇచ్చింది. రెట్టింపు స్థాయిలో 100 కంపెనీల సిఆర్‌పిఎఫ్ పోలీసులను వినియోగిస్తున్నారు. సిసి కెమెరాలతో నిశిత పరిశీలన చేయాలని మార్గదర్శకాలు జారీచేసింది. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంటు ఏజెన్సీలను వాడుకుంటోంది. దాదాపు 20 ఏజెన్సీలు ఉండగా, వాటి నుంచి కూడా నివేదికలు తెప్పించుకుంటున్నది. అలాగే మద్యం అమ్మకాలనూ పర్యవేక్షిస్తోంది. స్టాకు ఎంతుంది? ఎంత అమ్మాలి? ఎంత అమ్ముతున్నారు? తదితర వివరాలనూ నమోదుచేయిస్తోంది. మునుగోడు ఉప ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ భారీగా జరిగినా స్వల్పమొత్తంలో పట్టుకోవడంపై నివేదిక అధ్య యనం అనంతరం సిఇసి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. డబ్బు సుమారు రూ.4.66 కోట్లు, మద్యం 6143 లీటర్ల మేర మాత్రమే స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు 17

- ఆలస్య రుసుంతో డిసెంబర్ 20 వరకు అవకాశం
- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పదోతరగతి పరీక్షలు-2024 మార్చిలో హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు గడువు ఈ నెల 17వ తేదీ వరకు ఉంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.50తో వచ్చేనెల ఒకటి వరకు, రూ.200తో అదేనెల 11 వరకు, రూ.500తో 20వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఆయా తేదీల్లో సాధారణ సెలవులుంటే మరుసటి రోజు చెల్లించొచ్చని సూచించారు. విద్యార్థులు ఇతర సమాచారంకోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. వచ్చే ఏడాది మార్చిలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా సకాలంలో ఫీజు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకూ రూ.125 ఫీజు చెల్లించాలని సూచించారు. ఫెయిలైన విద్యార్థులు మూడు సబ్జెక్టుల కంటే తక్కువుంటే రూ.110, ఎక్కువుంటే రూ.125 కట్టాలని తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు రూ.125తోపాటు రూ.60 అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణాల్లో రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల కంటే తక్కువుంటే వారికి ఈ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తరి పొలం 2.5 ఎకరాల కంటే తక్కువ, మెట్ట పొలం ఐదెకరాల్లోపుంటే ఆ విద్యార్థులకూ ఫీజు మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం ఎంఆర్‌వో (తహశీల్దార్) ఇచ్చే ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు.

బిఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సమన్వయకర్తలను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు నియమించారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి పార్టీ సీనియర్ లీడర్ ఉప్పల వెంకటరమణ, నాగార్జునసాగర్‌కు పార్టీ సీనియర్ నాయకులు కడారి అంజయ్య, వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్‌కు ఈగ మల్లేశం పార్టీ సమన్వయకర్తలుగా నియమితులయ్యారు.

In the court of the III rd Addl. Junior Civil Judge, (Excise Court) Ananthapuramu
O.S.No:414/2018
Between:
1.Valmiki Nrithik Taman
2.Valmiki Yashas Taman (Minor) Rep by his Mother And Guardian ...Plaintiffs
And
Valmiki Venkata Ramanappa and others ...Defendants
Notice Defendant No:2 & 5
D2: Valmiki Chandra Shekar S/o V.Venkata Ramanappa,
D5: Valmiki Raja Kumar S/o V.Venkata Ramanappa, Both are R/at Flat No:207, Jadaarcade Paradise, Circle, MG Road, Beside Dadus Sweet Shop, Hydarabad Telangana State.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 07/11/2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(By order of the court)
N.P.SREENIVASULU
Advocate , Anantapuramu,
Cell:9440753607

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రషర్ క్వారీలో బండ తీసేందుకు లారీలో ప్రొక్లైనర్ తీసుకొస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా మండలం బొంపల్లిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొంపల్లి గ్రామ శివారులోని సూర లక్ష్మయ్య క్రషర్ క్వారీలో ప్రొక్లైన్ వాహనాన్ని తరలిస్తున్న లారీకి ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ తీగలు తగిలాయి. ఈ ప్రమాదంలో బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ దీపక్ నారాయణ కుమార్ సింగ్, మిర్యాలగూడకు చెందిన ప్రొక్లైన్ డ్రైవర్ భూక్య రవి మృతి చెందారు. మృతదేహాలను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు.

చంద్రబాబు ర్యాలీపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జైలు నుంచి విడుదలైన తర్వాత తొలిసారిగా బుధవారం హైదరాబాద్ వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబుకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలుకుతూ నిర్వహించిన ర్యాలీపై పోలీసులు కేసు నమోదుచేశారు. తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో.. ముందస్తు అనుమతి తీసుకోకుండా ర్యాలీ నిర్వహించడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

బేగంపేట ఎస్ఐ జయచందర్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ నగర టిడిపి జనరల్ సెక్రెటరీ జివిజి నాయుడుతో పాటు మరో ఆరుగురుపై ఐపిసి సెక్షన్ 341, 290, 341, 21 రెడ్ విత్ 76 సిపి యాక్ట్ ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేశారు.

విట్‌పై విదేశీ విద్యార్థుల ఆసక్తి

- చాన్స్‌లర్ జి విశ్వనాథన్ వెల్లడి

చెన్నయ్ : విదేశాల నుంచి విట్‌కు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆ యూనివర్శిటీ చాన్స్‌లర్ డాక్టర్ జి విశ్వనాథన్ అన్నారు. తమ సంస్థపై విదేశీ విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందన్నారు. విట్ చెన్నయ్‌లో 'ఫోస్టరింగ్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్' కారక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ.. విద్యా స్థాయిలు ఆర్థిక వ్యవస్థలను గొప్పగా నిలుపుతాయన్నారు. విట్ నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు.

మహబూబ్‌నగర్‌లో నేషనల్ మార్ట్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ రిటైల్ చెయిన్ సంస్థ నేషనల్ మార్ట్ మహబూబ్‌నగర్‌లో తన నూతన స్టోర్‌ను ఏర్పాటు చేసింది. గురువారం దీనిని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ లాంచనంగా ప్రారంభించారు. తమ వద్ద కిరాణా, స్టేషనరీ, హోమ్ అండ్ కిచెన్ అప్లయెన్సెస్, కుక్ వేర్, పాదరక్షలు, పురుషులు, మహిళలు, పిల్లల కోసం దుస్తులు సహా అనేక ఉత్పత్తులను సరసమైన ధరలకు ఒకే చోట లభిస్తాయని నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యష్ అగర్వాల్ పేర్కొన్నారు.

దాడులకు బెదరం.. పోరాటం ఆపం..

- మానుకోటలో పేదల గుడిసెలపై 17వ సారి దాడి
- ఎమ్మెల్యే శంకర్‌నాయక్ భూకబ్జాకోరు
- ఆయనకు ప్రజలు కాదు.. కోట్లు ముఖ్యం..
- సిపిఎం నేతలు జి నాగయ్య, ఎస్ వీరయ్య

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కురవి రహదారిలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను గురువారం తెల్లవారుజామున పోలీసులు 17వ సారి మళ్లీ నేలమట్టం చేశారని, ఎన్నిసార్లు కూల్చినా మళ్లీ పైకి లేస్తామే కాని దాడులకు బయపడి పోరాటాన్ని ఆపమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య స్పష్టంచేశారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ భూ కబ్జాకోరు అని, ఆయన అండతోనే పోలీసులు, రెవెన్యూ అధికారులు పేదలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేదల గుడిసెలను కూల్చిన విషయం తెలుసుకున్న వారు జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ బృందంతో కలిసి ఘటనాస్థలాన్ని సందర్శించారు. గుడిసెవాసులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మానుకోట పట్టణంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడారు.

కురవి రహదారిలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు సుమారు రెండువేల మంది గుడిసెలు వేసుకుని ఏడాదిగా నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తున్న స్థానిక ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్.. గుడిసెలు వేసుకున్న గిరిజన దళిత పేదలపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ అధికార యంత్రాంగంతో దాడులు, దౌర్జన్యం చేయిస్తూ ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే.. గుడిసె వాసులు నాన్ లోకల్ అంటున్నారని, శంకర్ నాయక్ నాన్ లోకల్ కాదా అని ప్రశ్నించారు. గుడిసె వాసుల తరపున తమ పోరాటం ఆగదని, కేసులు, దాడులకు భయపడేది లేదని హెచ్చరించారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలోనే పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించి.. ఇలా దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. 19 జిల్లాల్లో 69 కేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారని, కానీ ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్.. పేదల గుడిసెలు ఖాళీ చేయించేందుకు అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడం మూలంగానే అంబేద్కర్ భవనానికి, దోబీ గాట్లకు జిల్లా కలెక్టర్ శంకుస్థాపన చేయగలిగారని తెలిపారు. లేదంటే ఆ స్థలాలు ఎప్పుడో కబ్జా అయి ఉండేవన్నారు. అక్కడ 200 ఎకరాల భూమి ఉన్నదని, అంబేద్కర్ భవనం, దోబీ గాట్లకు 20 ఎకరాలు కేటాయించినా ఇంకా 180 ఎకరాలు పేదలకు పంచవచ్చని తెలిపారు. గుడిసెవాసులకు ఎర్రజెండా అండగా ఉంటుందని అన్నారు.

జి.నాగయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శంకర్ నాయక్.. ఎన్నికల వేళ ప్రచారం చేయకుండా వందలాది ఎకరాల భూములను కబ్జా చేయడం కోసం అధికారాన్ని వినియోగిస్తున్నారని విమర్శించారు. ఆయనకు ఓట్లు కన్నా.. భూములు, కోట్లు ముఖ్యమని విమర్శించారు. ఎమ్మెల్యే బినామీల పేరుతో వందలాది ఎకరాల భూములు సేకరించారని తెలిపారు. గుడిసె వాసులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తాము ఎమ్మెల్యే శంకర్ నాయక్‌కు విన్నవించినా.. భూములు ఇచ్చేది లేదంటూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే శంకర్ నాయక్, వరంగల్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ వైఖరి మార్చుకొని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, లేదంటే బీఆర్ఎస్‌ను గద్దె దించుతామని హెచ్చరించారు. సమావేశంలో మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, శెట్టి వెంకన్న, అల్వాల వీరన్న, ఆంగోతి వెంకన్న, బానోతు సీతారాం నాయక్, సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం పాల్గొన్నారు.

పాఠశాల బస్సు ఢీకొని బాలుడు మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యం కారణమంటూ గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి బాలుడు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కుంట్లూర్‌లో గురువారం జరిగింది. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని గణేష్ నగర్ కాలనీలో తన్నీరు శ్రీకాంత్ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. శ్రీకాంత్ వృత్తి రీత్యా పోస్టుమ్యాన్. వారి కుమార్తె నిషిత పెద్ద అంబర్ పేటలో క్యాండోర్ ష్రైన్ హైస్కూల్‌లో చదువుకుంటుండగా, కుమారుడు పవన్ హర్ష కుమార్ (3) ఇంటి వద్ద ఉంటున్నారు. రోజూలాగే గురువారం స్కూలు బస్సు ఇంటి వద్దకు రాగా నిషిత ఎక్కింది. వ్యాన్ డ్రైవర్ ఈశ్వర్ నిర్లక్ష్యం కారణంగా తండ్రి పక్కనే వ్యాన్‌కు ఆనుకుని ఉన్న పవన్ హర్షకుమార్ తలపైకి వ్యాన్ ఎక్కింది. దాంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకుల ఆందోళన

స్కూల్ యాజమాన్యం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని గ్రామస్తులు ఆందోళన చేశారు. ప్రయివేటు పాఠశాలలు విద్యాశాఖను తన గుప్పిట్లో ఉంచుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రయివేటు పాఠశాలలను కట్టడి చేయకుంటే భవిష్యత్ మరింత అంధకారంగా మారుతుందన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి అక్కడి నుంచి వారిని పంపించేశారు.

ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం

- 10 వరకు చేరేందుకు గడువు
- బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు గడువు ఈ నెల 10వ తేదీ వరకు ఉంది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు కాలేజీల్లో చేరాలంటే రూ.రెండు వేలు ఆలస్య రుసుం చెల్లించాలని కోరారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీల్లో ఉచితంగానే చేరేందుకు అవకాశముందని తెలిపారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను ఈ నెల 10 వరకు చేర్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన జూనియర్ కాలేజీల్లోనే ప్రవేశాలు పొందాలని విద్యార్థులు, తల్లిదండ్రులను సూచించారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఆ కాలేజీల జాబితాను పొందుపర్చామని వివరించారు.

కెసిఆర్‌కు కాళేశ్వరం ఎటిఎంగా మారింది

- మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు సిఎం కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంలా ఉపయోగపడుతోందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్ ఆరోపించారు. కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను పెంచారని విమర్శించారు. కాంగ్రెస్ మొదలుపెట్టిన అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును బిఆర్ఎస్ కాళేశ్వరంగా మార్చిందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాళేశ్వరం పేరు చెప్పుకుని బిఆర్ఎస్ ఓట్లు దండుకుందని చెప్పారు. కాళేశ్వరంపై విమర్శలు చేస్తున్న బిజెపి ఎలాంటి విచారణ చేయడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో లోపాలున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం వృధా చేసిన సొమ్ము తెలంగాణ ప్రజలపై అప్పుగా మారిందన్నారు. రైతుల కోసం

నీళ్లు ఇచ్చేందుకు అని చెబుతూనే అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ట్రాక్ రికార్డు కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ కాళేశ్వరం సందర్శనకు వెళ్లిన తర్వాత అనేక నిజాలు బయటపడుతున్నాయని చెప్పారు.

అధికార మదంతో కెసిఆర్ విర్రవీగుతున్నారు : రేణుక చౌదరి

రాహుల్‌గాంధీ కాళేశ్వరం పర్యటన కేవలం రాజకీయ స్వలాభం కోసం కాదని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి స్పష్టం చేశారు. సిఎం కెసిఆర్ అధికార మదంతో విర్రవీగుతున్నారని విమర్శించారు. ప్రతి మనిషిపై లక్షకుపైగా అప్పు భారం మోపిందన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న నకిలీ విత్తనాలతో ఎనిమిది వేల మంది రైతు కుటుంబాలు నాశమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సిఎం కెసిఆర్ నోరుమెదపడం లేదన్నారు. సిఎం కెసిఆర్ కౌలు రైతులను గుర్తించడం లేదన్నారు. ధరణి పోర్టల్‌తో కెసిఆర్ భూములు కాజేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో విఫలమైనట్టు ఒప్పుకుని చెంపలేసుకోవాలని సిఎంను కోరారు.

సిపిఐ(ఎంఎల్)ఆర్ఐ 22 స్థానాల్లో పోటీ

- రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ(ఎంఎల్)ఆర్ఐ రాష్ట్రంలో 22 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ గడ్డం సదానందం,ఎల్‌బి నగర్ ఆర్ సంతోష్ కుమార్, ఇబ్రహీంపట్నం ముద్దగౌని రాజ్యలక్ష్మి తుంగతుర్తి మేకల అరుణ్‌తోపాటు 22మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మ్యానిఫెస్టోలు, సంక్షేమ పథకాల బూచీతో ప్రజలను మరోసారి మోసగించడానికి పోటీ పడుతున్న బిజెపి, బిఆర్ఎస్ లను ఓడించాలని పేర్కొన్నారు. తాము పోటీ చేయని ఇతర చోట్లల్లో విప్లవ ప్రజాతంత్ర శక్తులు, స్వతంత్ర అభ్యర్థులను బలపరుస్తా మని స్పష్టం చేశారు.

ప్రభుత్వ బాలికల స్కూల్‌కు పిఎన్‌బి సాయం

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) సికింద్రాబాద్‌లోని ఓ ప్రభుత్వ బాలికల పాఠశాలకు సాయం అందించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా తిరుమలగిరిలోని గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్‌కు టాయిలెట్‌ను నిర్మించి ఇవ్వడంతో పాటుగా సానిటరీ నాప్పిన్ డిస్పెన్సింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎం అరుణ్ కుమార్, డిప్యూటీ రీజినల్ హెడ్స్ కెవి చంద్ర శేఖర్ రావు, నవిన్ నిచాల్ పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థినీలు పిఎన్‌బి అధికారులను ప్రశంసించడంతో పాటుగా సంతోషం వ్యక్తం చేశారు.

ఎవరొచ్చిన హైదరాబాద్ ప్రగతి ఆగదు

- రియాల్టీ అభివృద్ధే మా లక్ష్యం
- క్రెడాయ్ ప్రతినిధుల వెల్లడి

హైదరాబాద్ : వచ్చే శాసన సభ ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన హైదరాబాద్ ప్రగతి ఆగదని రియల్ ఎస్టేట్ వర్గాలు భావిస్తున్నాయి. ఎవరొచ్చిన ఈ నగరంలో రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఉంటుందని క్రెడాయ్ హైదరాబాద్ నూతన జనరల్ సెక్రటరీ బి జగన్నాథరావు అన్నారు. 2023-25కు గాను క్రెడాయ్ హైదరాబాద్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆ సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్షుడు వి రాజశేఖర్ రెడ్డి, జగన్నాథరావు ఇతర కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ సమతూల్యత వృద్ధిని పెంచే ప్రభుత్వాలు కావాలన్నారు. నిర్మాణ రంగంలో కొనేవాళ్లు కావాలని.. అలా ప్రభుత్వ విధానాలు ఉండాలని తాము కోరుకుంటామన్నారు. గతేడాది దాదాపు లక్ష యూనిట్ల అమ్మకాలు జరిగాయన్నారు. దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో ఇప్పటికీ చౌక ధరలో స్థలాలు, నివాసాలు లభ్యం అవుతున్నాయని తెలిపారు. గత రెండేళ్లుగా నగరంలో 4-5 శాతం వృద్ధి చోటు చేసుకుందన్నారు. ఇక్కడా ఎప్పుడూ డిమాండ్ ఉంటుందన్నారు. పశ్చిమ ప్రాంతంలోనే కాకుండా నగరం అన్ని వైపుల అభివృద్ధి చెందుతోందన్నారు. గత తొమ్మిదేళ్లుగా రియాల్టీ రంగం స్థిర వృద్ధితో రాణిస్తుందన్నారు. తలసరి ఆదాయాలు పెరుగుతున్నాయన్నారు.

నూతన నగర కమిటీ ఎన్నిక

క్రెడాయ్ హైదరాబాద్ నూతన కమిటీ అధ్యక్షులుగా వి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి జగన్నాథరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఎన్ జైదీప్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి ప్రదీప్ రెడ్డి, సిజి మురళీ మోహన్, కొత్తపల్లి రాంబాబు, ఎం శ్రీకాంత్ ఎన్నిక కాగా, కోశాధికారిగా మనోజ్ కుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులుగా జి నితీష్ రెడ్డి, క్రాంతి కిరణ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎ వెంకట్ రెడ్డి, బి జైపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ బన్సల్, సి అమరేందర్ రెడ్డి, సుశీల్ కుమార్ జైన్, మోరిశెట్టి శ్రీనివాస్, ముసునూరు శ్రీరామ్, ఎన్ వంశీధర్ రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం సుస్థిర అభివృద్ధికి నూతన బందం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తోందని వారు పేర్కొన్నారు. ఎత్తైన ఆధునిక భవనాలను నిర్మించే అవసరాలకు అనుగుణంగా శ్రామిక శక్తి సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టనున్నామన్నారు.

వట్టిపోతున్న.. జలాశయాలు

- మార్చి నెలను తలపిస్తున్న రిజర్వాయర్లు
- కనిష్ట స్థాయికి తగ్గిన నీటి మట్టం
- ఖరీఫ్‌కు కష్టం.. రబీకీ అందని సాగునీరు
- ఇప్పటికే జూరాలకు వారాబందీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరవళ్లు తొక్కాల్సిన కృష్ణ, తుంగభద్ర నదుల జలకళ కనిపించడం లేదు. ఎగువనుంచి వరదలు ఆగిపోయాయి. వరుణుడు మొహంచాటేశాడు. దాంతో ఇప్పుడే మార్చి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జూరాల అధికారులు వారబందీ ప్రకటించగా మరో వారం రోజుల్లో శ్రీశైలం నుంచి వచ్చే సాగు నీరు ఆగిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఖరీఫ్‌కే సాగు నీరు కష్టంగా ఉంటే రబీ పరిస్థితులు తలచుకుంటేనే ఆందోళనకరంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, సాగు నీటి ఎద్దడితో ప్రత్యామ్నాయ సాగు ఏర్పాట్లపై దృష్టి సారించాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో జూరాల, శ్రీశైలం రిజర్వాయర్లతో పాటు 16 జలాశయాలున్నాయి. రాష్ట్రంలో వర్షాలు ఆశించినతం కురవకపోగా, ఎగువనా వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. నీటి నిల్వలు రోజురోజుకు తగ్గిపోయి బోసిపోయినట్లుగా కనిపిస్తున్నాయి. దాంతో భూగర్భజలాలు సైతం పడిపోతున్నాయి. శ్రీశైలంలో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.81 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 67.98 టిఎంసిలు మాత్రమే ఉంది. గతేడాది ఇదే రోజు 143 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఇక మునుముందు నీటి నిల్వలు మరింత తగ్గే అవకాశాలున్నాయి. ఇక జూరాలలో 9.66 టిఎంసిలకు గాను 6.34 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది 8.83 టిఎంసిల నీరు ఉంది. జూరాలకు మోస్తరు వరద రావడంతో నీటి నిల్వ తగ్గడం లేదు. మరో వారం రోజుల్లో వర్షాలు రాకుంటే జిల్లాలో కరువు ఛాయలు కమ్ముకునే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో వంద ఎకరాల అయకట్టుకు మించి సాగునీరు అందించే చెరువులు 1500 ఉన్నాయి. వంద ఎకరాల లోపు ఆయకట్టు ఉన్న చెరువులు 4200 ఉన్నాయి. వర్షాధారం మీద ఆధారపడి సాగు చేసే పాలమూరు జిల్లాలో చెరువుల ద్వారానే సాగు చేస్తారు. జిల్లాలో ప్రధాన సాగునీటి వనరులైన శ్రీశైలం ఇప్పటికే వట్టిపోయింది. దాంతో కల్వకుర్తి ఎత్తిపోతలతో సాగవుతున్న పంట పొలాలకు సాగునీరు కష్టమే. జూరాల ప్రాజెక్టు ఆధారంగా సాగునీరు అందుతున్న కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులకు సైతం నీరందే అవకాశాలు లేవు. ప్రాజెక్టుల ద్వారా ఖరీఫ్‌లో 8.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందితే.. రబీలో 4లక్షల ఎకరాలకు సాగు నీరందుతోంది. పరిస్థితులు ఇలాగే సాగితే.. రబీలో సాగునీరు అందడం కష్టమే. ముఖ్యంగా వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలపై నీలినీడలు కమ్ముకున్నాయి. కాల్వల ద్వారా వచ్చే నీరు ఆగిపోతే మెట్ట పంటలు సైతం సాగు కావు.

అలుముకుంటున్న కరువు ఛాయలు..

ఉమ్మడి జిల్లాలో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ముఖ్యంగా ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదయ్యింది. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వరదలు మార్చి నెల వరకు వచ్చేవి. ఈసారి సెప్టెంబరులోనే నిలిచిపోయాయి. దాంతో తుంగభద్ర, కృష్ణానదుల్లో నీళ్లు లేక పిల్ల కాల్వలుగా మారాయి. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం మొదలుకొని వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో నదీ సమీప ప్రాంతంలో విరివిగా వివిధ రకాల పంటలు సాగయ్యేవి. ఇప్పడా పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా ఖరీఫ్‌లో వర్షాలు లేక పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రబీలోనైనా సాగు చేసి నష్టాన్ని పూడ్చుకుందామంటే ఆస్థాయిలో సాగు నీరు అందే అవకాశాలూ లేవు. గతం పునరావృతం అయ్యే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలి
బాల్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, వనపర్తి

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. ముఖ్యంగా నదుల్లో నీటి ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. దాంతో జిల్లాలో రబీలో ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించే విదంగా చర్యలు తీసుకోవాలి. లేనిచో రైతులు వలసలు పోయే అవకాశాలు ఉన్నాయి.

బడంగ్‌పేట్ మేయర్, కాంగ్రెస్ అభ్యర్థి ఇంట్లో ఐటి సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ నేతలపై గురువారం జరిగిన ఐటీ దాడులు కలకలం రేపాయి. రంగారెడ్డి జిల్లా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామ శివారులో కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఇంటితో పాటు ఆయనకు సంబంధించిన పలు కార్యాలయాలు, ఫామ్‌హౌస్‌లపై ఐటీ దాడులు జరిగాయి. బాలాపూర్ గ్రామంలోని మేయర్ ఇంటికి గురువారం తెల్లవారుజామున 5 గంటలకు వచ్చిన ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే ఆ సమయంలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తిరుపతిలో ఉన్నారు. దాంతో ఇంట్లో మేయర్ కూతురు ఒకరే ఉన్నారు. ఆమె ఫోన్‌ను ఐటీ

అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మేయర్ భర్త నరసింహారెడ్డి ఢిల్లీ నుంచి హుటాహుటిన తన స్వగృహానికి చేరుకున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు సోదాలు చేసి తిరిగి వెళ్ళిపోయారు.

కక్షతోనే ఐటి దాడులు : మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనపై కావాలని రాజకీయ కక్ష సాధింపు సాధిస్తున్నారని, కాంగ్రెస్ టికెట్ రాకుండా అడ్డుకోవడం జరిగిందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ఆరోపించారు. ఐటీ దాడులపై ఆమె స్పందిస్తూ.. తమను మానసికంగా వేధించటానికే బిఆర్ఎస్, బిజెపి కుట్రపన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, పారిజాత నర్సింహారెడ్డి తాజాగా మహేశ్వరం నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆ టికెట్ కోసం పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డికి రూ. 10 కోట్ల నగదు, 5 ఎకరాల భూమి ఇచ్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఐటీ రెడ్స్ జరగడం తీవ్ర కలకలం రేపుతుంది.

సమ్మేళనంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంలో అరాచకాలు, భూఆక్రమణలు

- సామాన్యులు బతకలేని పరిస్థితి
- అభివృద్ధి చేసే నాయకుడు కావాలా.. అరాచకాలు చేసే నాయకుడు కావాలా..
- ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల, పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలో నేడు అరాచకాలకు, అవినీతికి, భూ కబ్జాలకు ఆవాసమై సామాన్యులు బతకలేని పరిస్థితి దాపురించిందని కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్వాతంత్రం వచ్చిన దగ్గర నుంచి కాంగ్రెస్ పార్టీని బతికించింది ఆర్య వైశ్యులు అని, వామపక్ష భావజలంతో ఖమ్మం జిల్లా నైజాంకి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కలిగి ఉందని తెలిపారు. ఖమ్మం నగరంలోని స్థానిక 32వ డివిజన్‌లో బొలిశెట్టి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ నిన్న జరిగిన సభలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఓటమికి భయపడి దిగజారుడుగా మాట్లాడుతున్నారని తెలిపారు. దళిత బంధు, బిసి బంధు పేరుతో ఎస్‌సిలను, బిసిలను మోసం చేశారని విమర్శించారు. నలభై సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎవరిని వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టలేదని, ఆర్య వైశ్యులు, ముస్లిముల అండ లేకుండా ఖమ్మంలో ఏ నాయకుడూ కుర్చీ ఎక్కిన చరిత్ర లేదని, గతంలోనూ ఆర్య వైశ్యులకు ప్రాధాన్యత ఇచ్చామని, భవిష్యత్తులోనూ అధిక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ రాజకీయ నాయకునికి ఉండాల్సిన లక్షణాలకన్నా భిన్నమైన లక్షణాలు కలిగి ఉన్న వ్యక్తి పువ్వాడ అజయ్ అని, కక్ష సాధింపు అతని నైజమని, ఏ సామాజిక తరగతి దగ్గరకు వెళితే ఆ పేరు తగిలించుకుని తిరుగుతున్న మేక వన్నె పులి అని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధి చేసే తుమ్మల కావాలో... అరాచకాలు చేసే అజయ్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. ప్రశాంతమైన జీవితం గడపాలంటే, అరాచకాలు లేని ఖమ్మంను చూడాలంటే తుమ్మల నాగేశ్వరరావుని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు మహ్మద్ జావేద్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, మాజీ కార్పొరేటర్లు నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డేబోయిన నర్సింహారావు, కాంగ్రెస్ నాయకులు సుగ్గల ఈశ్వరలింగం, యెర్నేని రామారావు, మానుకొండ రాధా కిషోర్, శెట్టి రంగారావు, పొదిలి రవికుమార్, తాళ్లూరి హనుమంతరావు, కోసూరి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.